వడం లేదూ?"

"నాకలా అన్పించడం లేదే!"

"నాకెందుకో అలాగే అన్పిస్తుంది"

"ఏమిటండీ? నిరాశా నిస్పృహలతో మాట్లాడుతున్నారు! చెప్పండి. ప్లీజ్ చెప్పండి. మీరేదో చెప్పాలనుకుంటున్నారు. అంతలోనే ఏదో దాస్తున్నారు. మీ మాటకు నేనెన్నడూ అడ్డు రాను. మంచికి మారుపేరైన మీరు నాకు భర్తగా లభించడమే నా అదృష్టం. మీ భావాలతో నేను తప్పకుండా ఏకీభవిస్తాను. అదేమిటో కాస్త చెప్పండి ప్లీజ్. చెప్పకుంటే నామీద ఒట్టే" అంటూ శ్రీలక్ష్మి భర్త కుడిచేతిని తీసి తన తలపై పెట్టుకుంది.

"చూడు లక్ష్మీ! అనాథగా శరణాలయంలో పెరిగిన నాకు ఆ శరణాలయంపైనా ఆ అనాథ పిల్లలపైనా మమకారం చావలేదు. ఈ జగన్నాథం బాబాయే వాళ్లకు అమ్మయినా నాన్నయినానూ! వాళ్ల పోషణకుగాను ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది నిజమే. అయినా మాకంటూ ఎవరూ లేరన్న నిర్లిప్తత ఆ పసిహృదయాల్లో చోటుచేస్కో కూడదు. సొంత రక్తంలో పరాయితనం చూసే మహానుభావుల రాక్షసత్వం వాళ్లకు తెలీదు. ఈ జగన్నాథం బాబాయి పంచిచ్చే ప్రేమామృతం తప్ప!

అలాగే రోగాలతో బాధపడే వాళ్లూ ఎంతోమందున్నారు ఈ లోకంలో. అలాంటి వాళ్లకు ప్రప్రథమంగా కావాల్సింది డబ్బే..కాదనను. అయినా ఓ మంచి మాటా... చల్లని చూపూ కరువై ఏ ఆలంబనా లేనివాళ్లూ... జీవచ్ఛవాలుగా మిగిలిన మేమింక బ్రతికినా చచ్చినా ఒక్కటే అనుకుని తమ భావిజీవితాలను అసహ్యించుకుంటూ అనాథవృద్ధ రోగులూ.. భయంకర వ్యాధిపీడితులూ లోలోన ఎంతగానో కుమిలికుమిలి ఏడుస్తూంటే, పల్కరింపే వాళ్లకో ఆలంబన అవుతుందనే సద్భావనతో కొన్ని ఘడియలైనా అలాంటి వాళ్లతో కులాసాగా కబుర్లు చెబుతూ గడిపేయాలని తెగ ఆరాటపడిపోతుంటుంది నా మనసెంతగానో! అందుకే నీ అభిమతానికి భిన్నంగా నా జీవనం గమిస్తోంది. తప్పే చేస్తున్నానో ఒప్పే చేస్తున్నానో నీకు అన్యాయం జరుగుతోందని నువ్వు భావిస్తే మాత్రం నీ దిశానిర్దేశానికి భిన్నంగా ఇకపై నేనే పనీ చెయ్యను. సరేనా?" అన్నాడు జగన్నాథం లాలనగా ఓదార్పుగా.

"నా మాట కాదనరుగా! అయితే వినండి. సహధర్మచారిణిగా మీ ఇష్టాయిష్టాలను నేనేనాడూ కాదనను సరి కదా సంపూర్ణ సహాయ సహకారాలనందిస్తా! మ..రై..తే.."

"చెప్పు లక్ష్మీ.. చెప్పు..!" ఆశ్చర్యానందాలను కలబోస్తూ ఎంతో ఆత్రంగా అడిగాడు జగన్నాథం.

"మరేం లేదండీ! మీతోబాటే నేను కూడా రోజూ హాస్పిటళ్లకూ అనాథ శరణాలయానికీ తోడుగా వస్తుంటానండీ..ప్లీజ్! కాదనరుగా?"

"నిజంగా నువ్వు నా జీవనజ్యోతివి శ్రీలక్ష్మీ" అంటూ గాఢాలింగనం చేస్కుంటూ జగన్నాథం ఆనందభాష్పాలను జలజలా రాల్చేశాడు.

**-కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం**
**(జగిత్యాల)**

# ఉడతాభక్తి

గౌరి పనికిరాకపోతే కబురైనా పంపేది. ఈసారి పది రోజులవుతున్నా, మనిషి జాడ లేదు. ఎవరితోనూ కబురంపలేదు. ఇంటికి మనిషిని పంపాను. తాళం వేసుందని బదులొచ్చింది.

"పది రోజులవుతున్నా రాని ఆ గౌరి కోసం ఎదురు చూస్తూ, ఇంటి పనంతా ఒక్క దానివే చేస్తూ మూలపడే కంటే ఇంకోహళ్లని కుదుర్చుకో" భర్త ఉచిత సలహా చెప్పి ఆఫీసుకి వెళ్లాడు.

'ఐదేళ్ల బట్టీ నమ్మకంగా, నమ్రతగా ఇంట్లో పన్జేస్తున్న గౌరిని కాదని వేరే మనిషిని ఏర్పాటు చేసుకోవడానికి మనసంగీకరించడం లేదు. ఏదో బలమైన కారణం ఉండి ఉంటుంది' అనుకున్నాను.

మరో రెండ్రోజుల తర్వాత... ఇంటి ముందు ఏవో మాటలు వినిపిస్తుంటే బయటికొచ్చాను.

గుమ్మంలో గౌరి నిలబడుంది.

"అమ్మ అలుసు చూసుకుని చెప్పాపెట్టకుండా పని మానేస్తే, మాకింకో పనిమనిషి దొరకదనుకుంటున్నావా?" నా పెద్ద కూతురు గౌరిని నిలదీస్తోంది.

"లోపలికి రానీయండమ్మా! ఏం జరిగిందో చెప్తాను" అని గౌరి ప్రాధేయపడుతోంది.

"పోయిన్నెల నీకిచ్చిన దానికీ, నువ్వు చేసిందానికీ సరిపోయింది. వచ్చిన దారినే వెళ్లు. మేం వేరే పనిమనిషిని చూస్తున్నాం" అని నా రెండో కూతురు రెచ్చిపోతోంది.

గౌరి నావైపు ప్రాధేయపడుతున్నట్టు చూసి-"అమ్మా! మీరైనా నేన్చెప్పేది వినండమ్మా" అంది.

నా చిన్న కూతురు మళ్లీ కల్పించుకుని గౌరిని ఏదో అనబోతుంటే "మీ కాలేజీలకి టైమవుతుంది, వెళ్లి త్వరగా తయారవ్వండి" అన్నాను. నా కోపం తెలిసిన మా అమ్మాయిలిద్దరూ లోపలికెళ్లారు.

"ఏమైందే నీకు.. కనీసం మాటైనా చెప్పకుండా ఎక్కడికెళ్లావు? ఇంట్లో ఫంక్షనుందని తెల్సుగదా! కనీసం ఇంకొహళ్లని ఏర్పాటు చేసి వెళ్లొచ్చుగదా! తెరిపి లేకుండా కురుస్తున్న ఈ వర్షాల్లో ఎంత ఇబ్బంది పడ్డామో ఆ భగవంతుడికే ఎరుక" అన్నాను.



"అమ్మా! నాది తప్పే! నేను చెప్పేది మీరైనా వినండి. ఆ తర్వాత మీరు రావొద్దంటే అలాగే వెళ్లిపోతాను".

"ఏంటో చెప్పు" అన్నాను కోపంగా.

"ఈ వానలకి మా ఊరి పక్కనున్న రామాపురం చెరువు కట్ట తెగిపోయి ఊరంతా కొట్టుకుపోయింది. మావోళ్ల గుడిసెలన్నీ నేలమట్టమయ్యాయి. మావోళ్లంతా అనాథల్లా పిల్లాజెల్లాతో తలదాచుకునే చోటులేక చెట్టు పుట్టలపాలయ్యారు. ఎంతో మంది ఎన్నో రకాలుగా వాళ్లని ఆదుకుంటున్నారు. మా పనోళ్ల సంఘంలో మనిషికి 500 రూపాయలు వసూలు చేసి, రామాపురంలో ఇవ్వాలని నిర్ణయించారు."

"అందుకని.."

"అమ్మగారూ! మీకు తెలీన్దేముంది, నాకొచ్చే దాంట్లో ఇద్దరు పిల్లల్ని, అత్తమామల్ని సాకటమే కష్టమవుతోంది. ఐదొందలు ఇయ్యలేని నాలాంటోళ్లం పదిమంది కలిసి, రామాపురంలో వాళ్లకి కొత్తగా కట్టే ఇళ్ల దగ్గర, డబ్బు తీసుకోకుండా ఇటుకలు, సిమెంటు మోసే పని చేసొచ్చాం. అందుకే ఈ పదిరోజులూ పనికిరాలేదు. ఈ పది రోజులు జీతం నాకు తగ్గించి ఇవ్వండమ్మా"

గౌరి మాటలు విన్నాక నా ముందు ఆమె ఎంతో ఎత్తులో ఉన్నట్టన్పించింది.

"ఆ పని చేసి నీ ముందు నా పెద్దరికాన్ని చిన్నబరుచుకోలేను గానీ వచ్చి పన్లో చేరు" అన్నాను.

ఆరోజు రాత్రి..

"అమ్మా! త్వరగా రా! గౌరి టీవీలో కన్పిస్తోంది" పెద్ద కూతురు అరిచినట్టు పిలిచింది.

టీవీ న్యూస్‌లో వరదబాధితులకు పునరావాసం కల్పిస్తూ నిర్మిస్తున్న గృహనిర్మాణంలో స్వచ్ఛంధ సేవలందిస్తున్న మహిళలు అంటూ... చూపుతున్న క్లిప్పింగ్స్‌లో ఇటుకలు మోస్తూ కనిపించిన గౌరిని చూసి.. ఆమె ఉడతాభక్తికి మనసులోనే పులకించిపోయాను.

**-ఎం.వెంకటేశ్వరరావు(సికిందరాబాద్)**